పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు

● మంత్రి జోగి రమేష్
● ఆకునూరులో ఆసరా పండగ



ఆకునూరులో లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: భారతదేశ చరిత్రలో పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు నింపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. మండలంలోని ఆకునూరు జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో ఆసరా నాలుగో విడత సభ నిర్వహించారు. ఆకునూరు, పెదఓగిరాల, చిన ఓగిరాల, గండిగుంట గ్రామాలకు చెందిన 331 డ్వాక్రా పొదుపు సంఘాల సభ్యులకు రూ.3.12 కోట్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును మంత్రి రమేష్ అందజేశారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయాలి..

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ చంద్రబాబులా మోసం చేసే నైజం సీఎం జగనన్నది కాదన్నారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో సొమ్మును ఖాతాలకు జమ చేసిన మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజా జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో ఏ ఒక్క రోజైనా ప్రజా సంక్షేమం గురించి ఆలోచించాడా అని ప్రశ్నించారు. పేదలు ఆర్థికంగా బలోపేతమై విద్యావంతులు కాకూడదన్న ఆలోచన ఉన్న వ్యక్తులు ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క చంద్రబాబు, పవన్‌లు మాత్రమే అన్నారు. మన జగనన్న మనకు చేసిన మంచిని గుర్తుంచుకుని అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భావితరాల భవిష్యత్తుకు మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పెనమలూరులో జగనన్న సైనికుడినైన తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చీలి కల్పన, వైస్ ఎంపీపీ రాచబత్తుల మధుసూదనరావు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు త్రిపురం లక్ష్మి, గెత్తం అనుపమ, ఎంపీటీసీలు గుంటక నాగిరెడ్డి, బందెల శ్రీనివాసరావు, గుండె పోతురాజు, పార్టీ మండల అధ్యక్షుడు దాసి రవి, ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, నాయకులు పాలడుగు శివజ్యోతి, గెత్తం విజయ్ కుమార్, మెరుగు మాల ఏసుబాబు, రామావత్ శ్రీకాంత్, త్రిపుర చందు పాల్గొన్నారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కాకాని విగ్రహాలకు మంత్రి జోగి రమేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. మహిళలతో కలిసి సభలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు జై జగన్.. జోహార్ వైఎస్సార్ అంటూ నినదించి తమ అభిమానాన్ని చాటారు. ఆసరా సభకు వచ్చిన మంత్రికి పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు ఘన స్వాగతం పలికారు.


మంత్రి జోగి రమేష్‌ను సత్కరిస్తున్న ప్రొద్దుటూరు గ్రామస్తులు

సమష్టి కృషి, సమన్వయంతోనే ప్రగతి

కంకిపాడు: సమష్టి కృషి, సమన్వయంతోనే నియోజకవర్గ ప్రగతి సాధ్యమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు, దావులూరు, కుందేరు, కందలంపాడు, కోలవెన్ను, గొల్లగూడెం, పునాదిపాడు గ్రామాల్లో మంత్రి జోగి రమేష్ గురువారం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మమేకమై స్థానికంగా నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలను ఢీకొట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని, ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు అన్నీ ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీని ఎదుర్కొనటం సాధ్యం కాదని చెప్పారు. ప్రజాకోర్టులో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, పిడికిటి రామకోటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే లయన్స్ లక్ష్యం



పెనమలూరు: సమాజంలో నిరుపేదల సంక్షేమమే లయన్స్ లక్ష్యమని లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్, అమెరికాకు చెందిన జె.ఫ్రాంక్‌మూర్ అన్నారు. పోరంకిలో గురువారం చిగురుపాటి మంజులవాణి వరప్రసాద్ లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సేవా మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లయన్స్ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జిల్లా లయన్స్ గవర్నర్ లయన్ జెఎస్.శంకర్‌గుప్తా మాట్లాడుతూ.. జిల్లా స్థాయి సేవా మహోత్సవంలో 32 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, 73 మందికి కుట్టు మిషన్లు, 72 మంది విద్యార్థులకు సైకిళ్లు, 47 మంది పేద మహిళలకు వెట్ గ్రైండర్లు, 10 మంది బధిరులకు వినికిడి మిషన్లు అందజేశామన్నారు. 243 మందికి రూ.25 లక్షల పరికరాలు అందించామని చెప్పారు. లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్, లయన్స్ వంకా రవీంద్రనాథ్, టి.దుర్గామల్లేశ్వరరావు, మహోత్సవ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, మద్దినేని చక్రధర్, కొల్లి రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పోలీస్ సర్కిల్ కార్యాలయ భవనం ప్రారంభం



హనుమాన్‌జంక్షన్ రూరల్: దశాబ్దాలుగా అద్దె గదిలో కొనసాగుతున్న హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి నూతన భవనం సిద్ధమైంది. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా శుక్రవారం నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి తెలిపారు. స్థానిక హనుమాన్‌నగర్ స్వరాజ్ నగర్‌లో గ్రామ పంచాయతీకి చెందిన 10 సెంట్ల స్థలాన్ని కేటాయించటంతో దాతల విరాళాలతో రూ.కోటి వ్యయంతో హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయం నిర్మాణం చేపట్టారు. సరిగ్గా 30 ఏళ్ల క్రితం 1993 ఫిబ్రవరి 2న హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ ఏర్పడగా, అప్పటి నుంచి 20 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా సేవలు అందించారు. ఎమ్మెల్యే వంశీ చొరవతో సొంత భవనం ఏర్పడింది.

పలువురు అధికారుల బదిలీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు తహసీల్దార్‌గా అంకం శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.రత్నకుమారి బదిలీపై వచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న సునీల్ బాబు, ఎంపీడీఓ కె.జోగేశ్వరరావులు బదిలీ అయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ బాపులపాడుకు, తూర్పుగోదావరి జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారి రత్నకుమారి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

పెనమలూరు: పెనమలూరు మండలానికి ఎంపీడీఓగా ఎంవీఆర్.కుమార్‌బాబును నియమిస్తూ గురువారం జిల్లా పరిషత్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన సునీతాశర్మను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి కుమార్‌బాబును పెనమలూరు ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

గన్నవరంరూరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పత్రీజీ ధ్యాన కేంద్రం సీనియర్ ట్రైనర్ నాగ రమాదేవి అన్నారు. బీబీ గూడెం గ్రామంలో సరస్వతీ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జరిగిన సప్తాహంలో ఆమె మాట్లాడుతూ.. ధ్యానం వల్ల ఏకాగ్రత లభించటంతో కార్య సాధన సులువుగా ఉంటుందన్నారు. ట్రైనర్లు, అభ్యాసకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని వినతి

గన్నవరం: మేజర్ గ్రామ పంచాయతీ గన్నవరానికి చెత్త డంపింగ్ కోసం అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని సీపీఎం నేతలు కోరారు. గురువారం నాయకులు మాట్లాడుతూ.. గతంలో జిల్లా కలెక్టర్ స్థలం కేటాయించినప్పటికీ రెవెన్యూ అధికారులు ఇంత వరకు స్థలం అప్పగించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

గన్నవరం: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై దాడి కేసులో ఐదుగురు నిందితులను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల సమాచారం ప్రకారం.. గత నెల 21న కేసరపల్లి పరిధిలోని ఓ హోటల్ వద్ద రంగబాబుపై ఈ దాడి జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు దాడికి పాల్పడిన ఆత్కూరుకు చెందిన ముగిరాల చిరంజీవి, హైదరాబాద్‌కు చెందిన అడప వెంకటరాజు, అబ్దుల్ యాహియ, మహ్మద్ జహీర్, మహ్మద్ జునైద్‌ను అరెస్ట్ చేసి 12వ ఏఎంఎం కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్ నిమిత్తం సబ్‌జైలుకు తరలించారు. ఈ కేసులో ఆరోవ నిందితుడైన అతిక్ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన రంగబాబు ఎమ్మెల్యే వంశీ, ప్రభుత్వంలోని పెద్దలను తీవ్ర పదజాలంతో దుర్భాషలాడడం తట్టుకోలేక చిరంజీవి తన మిత్రులతో కలిసి ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు.

తంచన్‌గా పింఛన్ల పంపిణీ


కానూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న తాడిగడప కమిషనర్ వెంకటేశ్వరరావు


విజయవాడలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

విజయవాడరూరల్: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ల పంపిణీని గురువారం తెల్లవారుజాము నుంచే ప్రారంభించారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ కానుకను అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. విజయవాడ రూరల్ మండలంలో గురువారం 72 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఎ.రమ్యశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 17 వేల 541 మందికి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయగా వాటిలో మొదటి రోజున 12 వేల 735 మంది లబ్ధిదారులకు 3 కోట్ల 81 లక్షల 99వేల రూపాయల పింఛన్లు పంపిణీ చేశామన్నారు.

పింఛన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో వైఎస్సార్ పింఛన్ కానుకలో లోపాలు లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. కమిషనర్ గురువారం కానూరు సచివాలయం 3లో వైఎస్సార్ పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ అందజేయాలన్నారు. కులగణన సర్వేను సచివాలయం సిబ్బంది సమర్థవంతంగా చేయాలని ఆదేశించారు.

జగనన్నతోనే పేదలకు న్యాయం..

జగనన్నతోనే పేదలకు న్యాయం జరుగుతుందని వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆయన గురువారం సచివాలయం 5 పరిధిలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. నాయకులు వేమూరి బాలకృష్ణ, తుమాటి నిర్మల, నర్రా ఆంజనేయప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

రామవరప్పాడులో పంపిణీ

రామవరప్పాడు: రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పింఛన్ కానుకను పంపిణీ చేశారు. తొలి రోజు 90 శాతానికి పైగా పంపిణీ చేశామని చెప్పారు.

ఉంగుటూరులో 83 శాతం పంపిణీ

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో సామాజిక పింఛన్లు 83 శాతం పంపిణీ చేశామని మండల పరిషత్ ఏఓ ఎస్.బసవయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయాల్లో 8,238 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.2.40 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 6,847 మందికి రూ.2 కోట్లు వలంటీర్లు గురువారం పంపిణీ చేశారన్నారు. పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.

విజయవాడ ఆస్పత్రిలో..

పెనమలూరు: పింఛన్ పంపిణీ చేయటంలో సచివాలయ ఉద్యోగులు మరోసారి తమ చిత్తశుద్ధి చాటారు. తాడిగడప సచివాలయం రెండు పరిధి కార్మికనగర్‌లో ఉంటున్న కాసా విజయలక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు వైద్య ఖర్చులకు ప్రభుత్వం ప్రతీ నెల రూ.10 వేల పింఛన్ ఇస్తుంది. ప్రస్తుతం ఆమె విజయవాడ ఆయూష్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతుంది. ఆమెకు గురువారం సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రంజిత్‌కుమార్ ఆస్పత్రికె వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక అందజేశారు.

ఆస్పత్రులకు వెళ్లి పెన్షన్ల అందజేత

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న వలంటీర్లు గురువారం ఆస్పత్రులకు వెళ్లి పెన్షన్లు అందజేశారు. సచివాలయం-2లో వలంటీర్‌గా పని చేస్తున్న రాజబోయిన గణిత విజయవాడ యూనియన్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న అట్లూరి శేషమ్మకు పెన్షన్ అందజేశారు. చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామానికి చెందిన వీసం సాంబశివరావుకు వలంటీర్ పవన్‌కళ్యాణ్ పెన్షన్ అందజేశారు. ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో లబ్ధిదారు గరిమెళ్ల సీతారామయ్యకు వలంటీర్ కొండపాటూరి రాజేష్ పెన్షన్ అందజేశారు. వలంటీర్లను సేవలను పింఛన్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కొనియాడారు. వలంటీర్లను సర్పంచ్ వేము రాధాకృష్ణ, కార్యదర్శి కె.లక్ష్మి, సచివాలయం సిబ్బంది అభినందించారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే వంశీ పరామర్శ


రామన్నగూడెంలో పార్టీ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. కాకులపాడు సర్పంచ్ కాజా ప్రసాద్ తండ్రి దశమంతరావు అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే వంశీ నివాళులర్పించారు. సర్పంచ్ కాజా ప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రామన్నగూడెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నగలం సత్యనారాయణ తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందటంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. రంగయ్య అప్పారావు పేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లిబోయిన శ్రీహరి తండ్రి జయరాం ఇటీవల మృతి చెందటంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరవల్లిలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహన బెనర్జీ సతీమణి జానకిరత్నం ఇటీవల అనారోగ్యంతో మరణించటంతో ఆయనను ఎమ్మెల్యే వంశీ పరామర్శించారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాయి సత్యనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఏపీ ఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ చైర్మన్లు దయాల విజయనాయుడు, అల్లాడి థెరిస్సా, మూల్పూరు ప్రభుకాంత్, ఎంపీటీసీ సభ్యులు పడకల కోటేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడకల వీర్రాజు, నాయకులు సూరపనేని రాధాకృష్ణామూర్తి, యర్రంశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.

రూరల్ ఎంపీడీఓ రమ్యశ్రీ బాధ్యతల స్వీకరణ


రమ్యశ్రీకి బాధ్యతలు అప్పగిస్తున్న భార్గవి

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అద్దంకి రమ్యశ్రీ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ నుంచి బదిలీపై విజయవాడ రూరల్ మండలానికి వచ్చిన రమ్యశ్రీ, ఎంపీడీఓ బి.భార్గవి నుంచి ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. విజయవాడ రూరల్ మండలం నుంచి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలానికి ఎంపీడీఓ బి.భార్గవి బదిలీ అయ్యారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన రమ్యశ్రీకి రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, కో ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్, ఈఓఆర్డీ బి.వి.శేషగిరిరావు, మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నం, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ ఏఓ ఆనందకుమారి, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

వసతుల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి


హాస్టల్ విద్యార్థినులకు ఇన్వర్టర్ అందజేస్తున్న దాత కందిమళ్ల, ఎంపీపీ రవి

గన్నవరం: సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహానికి గురువారం కందిమళ్ల సరస్వతి ట్రస్ట్ చైర్మన్ కందిమళ్ళ శ్రీనివాసరావు రూ.25 వేలు విలువైన విద్యుత్ ఇన్వర్టర్‌ను అందజేశారు. ఎంపీపీ రవి మాట్లాడుతూ.. తాము చదువుకునే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో కనీస సదుపాయలు ఉండేవి కావన్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్య ప్రమాణాలను మెరుగుపర్చిందని చెప్పారు. తన కోరిక మేరకు విద్యార్థుల సౌకర్యార్థం ఇన్వర్టర్‌ను అందజేసిన శ్రీనివాసరావును అభినందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య మాట్లాడుతూ.. సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన తన కున్న దాంట్లో కొంత సేవా కార్యక్రమాలకు వెచ్చించడం స్ఫూర్తినీయమన్నారు. ప్రభుత్వంతో పాటు దాతలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థినులు ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఇన్వర్టర్ దాత శ్రీనివాసరావును హాస్టల్ వార్డెన్ కె.శోభ, విద్యార్థినులు సత్కరించారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని బాబీ, పంచాయతీరాజ్ ఏఈ దాసు, ఏఎస్‌డబ్ల్యూ వెంకటరమణ, లోకం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉదారత చాటిన సీఐ



పెనమలూరు: లారీ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను పెనమలూరు సీఐ టీవీవీ రామారావు సకాలంలో సాయం అందించి డ్రైవర్ ప్రాణాలు కాపాడారు. పెనమలూరు సీఐ రామారావు గురువారం మచిలీపట్నానికి వెళ్తున్న క్రమంలో గూడూరు మండలం తరకటూరు గ్రామం వద్ద కంకర లోడ్ టిప్పర్ అదుపుతప్పి జాతీయ రహదారిపై పల్టీ కొట్టింది. ఈ ప్రమాద ఘటన చూసిన సీఐ రామారావు వెంటనే తన వాహనం ఆపి స్థానికుల సహాయంతో లారీ డ్రైవర్‌ను లారీ నుంచి బయటకు తీశారు. గాయపడిన లారీ డ్రైవర్‌కు సపర్యాలు చేసి వెంటనే ఆస్పత్రికి తరలించారు.

జగనన్న ప్రభుత్వంలో మైనార్టీలకు మేలు



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్

పెనమలూరు: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్.గౌస్ మొహిద్దీన్ అన్నారు. యనమలకుదురు ఈద్గాను గురువారం ఆయన సందర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలతో మైనార్టీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించారన్నారు. జగనన్నను మైనార్టీలు ఆశీర్వదించాలని కోరారు. ఈద్గా వద్ద ఉన్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మైనార్టీ పెద్దలు సయ్యద్‌బాబు, ఎండీ కరీముల్లా, ఎండీ ఇంతియాజ్, షేక్.సుభాని, షేక్.మౌలాలి, ఫజల్‌హక్, ఎండీ ఖాన్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన జరుగనుంది. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

వికాస కేంద్రం భవనానికి టైల్స్ వితరణ



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న స్పందన మానసిక వికాస కేంద్రం నూతన భవనానికి రూ.1.50 లక్షల విలువైన టైల్స్‌ను దాత గరికపాటి శివశంకర్ అందజేశారు. ఈ మేరకు గురువారం టైల్స్‌ను వికాస కేంద్రం నిర్వాహకులకు దాత అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఎటువంటి లాభాపేక్ష లేకుండా దివ్యాంగులు సేవా చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా వికాస కేంద్రం ద్వారా పరిసరా గ్రామాలకు చెందిన దివ్యాంగులకు ఉచిత విద్య, వైద్యం, భోజనం, రవాణా సదుపాయలను కల్పించడం స్ఫూర్తినీయమని కొనియాడారు. అందుకే దివ్యాంగుల కోసం నిర్మిస్తున్న నూతన భవనానికి తన వంతు సహకారం అందించినట్లు తెలిపారు. శివశంకర్‌ను సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ అభినందించారు. వికాస కేంద్రం కార్యదర్శి ఎస్.రజిత, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతుల అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: తాడిగడప గ్రామంలో ఇద్దరు యువతులు అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప రామానగర్‌కాలువ కట్టకు చెందిన రేవళ్ల వెంకటమ్మ ఇళ్లలో పనులు చేసుకుంటుంది. ఆమె కుమార్తె(17) ఇంటి వద్ద కుట్టు పనులు నేర్చుకుంటుంది. వెంకటమ్మ ఇంటి సమీపంలో ఉంటున్న తోటి కోడలు బాల కుమార్తె(17) కూడా కుట్టు పని నేర్చుకుంటుంది. ఈ ఇద్దరు యువతులు బుధవారం సాయంత్రం పానీపూరి తిని వస్తామని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో వారి కోసం వెతికినా జాడ తెలియలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దోమల నిర్మూలనకు చర్యలు

కంకిపాడు: దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి. శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో దోమల నిర్మూలన ప్రత్యేక డ్రైవ్ గురువారం చేపట్టారు. ప్రధాన వీధులు, డ్రెయినేజీ మురుగు నిలిచిన ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. దోమలను నిర్మూలించుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, ఏఎన్ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళను బెదిరించిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: మహిళను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి వసంతనగర్‌కు చెందిన మేకల అనిత గతంలో తిరుపతిలో ఉంటున్న ఆమె మేనమామ కుమార్తె వలపుల శ్రీదేవికి రూ.20 లక్షలు అప్పు ఇచ్చింది. గతేడాది జులైలో తీసుకున్న అప్పు చెల్లిస్తానని తెలిపింది. అయితే ఆమె చెప్పిన సమయానికి సొమ్ము చెల్లించలేదు. సొమ్ము కోసం అనిత అనేక సార్లు ఫోన్ చేయగా శ్రీదేవి, ఆమె భర్త దశరథనాయుడు చంపుతామని బెదిరించసాగారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.